ప్రజాశక్తి

శనివారం 18 మే 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

పల్నాడులో అల్లర్లపై సిట్

- ఐజి వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో 13 మంది అధికారుల నియామకం
- రేపటిలోగా ఈసీకి ప్రాథమిక నివేదిక



పోలింగ్ రోజున పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో కర్రలతో ఘర్షణకు వెళ్తున్న ఓ పార్టీకి చెందిన శ్రేణులు



144 సెక్షన్ అమలు నేపథ్యంలో రెంటచింతలలో మూతబడ్డ దుకాణాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్, అనంతరం రెండ్రోజుల పాటు పల్నాడు జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనలపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తూ రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బృందంలో ఎస్‌ఈబి డైరెక్టర్, ఐజి వినీత్ బ్రిజ్‌లాల్‌తో పాటు 13 మంది అధికారులను నియమించారు. ఎసిబి ఎస్‌పి రమాదేవి, ఎసిబి అదనపు ఎస్‌పి సౌమ్యలత, డిఎస్‌పిలు రమణమూర్తి, శ్రీనివాసులు, శ్రీనివాసరావు, మనోహరాచారి, సిఐలు వి.భూషణం, వెంకటరావు, రామకృష్ణ, జి.ఎల్.శ్రీనివాస్, మోయిన్, ప్రభాకర్ శివప్రసాద్ ఈ బృందంలో ఉన్నారు. రెండ్రోజుల్లో నివేదికివ్వాలని ఎన్నికల కమిషన్ ఆదేశించడంతో ఆదివారం కల్లా నివేదిక రూపొందించనున్నారు.

తొలుత పోలీసుస్టేషన్ వారీగా నమోదైన ఎఫ్ఐఆర్‌లు, నిందితులుగా పేర్కొన వారి పేర్లు, నమోదు చేయాల్సిన సెక్షన్లు, అవసరమైతే మార్పు చేయడం, ఇప్పటి వరకు అరెస్టు చేసిన వారి వివరాలను సిట్ బృందం సేకరిస్తోంది. అంతేగాక ఘర్షణ, దాడులకు సంబంధించి వేర్వేరుగా దర్యాప్తు చేయనున్నారు. పల్నాడు జిల్లాలోని మాచర్ల, గురజాల, పెదకూరపాడు, సత్తెనపల్లి,

▶ 2లో

ఎండల్లో హోయిహోయి..

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి, తాడికొండ, గుంటూరు, చేబ్రోలు, తెనాలి, పెదకాకాని, భట్టిప్రోలు,కొల్లూరు, దుగ్గిరాల మండలాల్లో జల్లులతో కూడిన ఒక మోస్తరు వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఉద్యాన పంటలకు అపార నష్టం వాటిల్లింది. అరటి, మామిడి, పసుపు, బొప్పాయి తదితర పంటలు గాలులు, వర్షానికి దెబ్బతిన్నాయి. జిల్లాలోని ఆరు మండలాల్లో 200 ఎకరాల్లో మామిడి కాయలు రాలిపోయినట్టు అంచనా. మరో 100 ఎకరాల్లో అరటి నేల వాలినట్టు తెలిసింది. వేసవి తీవ్రత అధిక అవుతుందని భావిస్తున్న తరుణంలో వాతావరణంలో మార్పు వచ్చి అకాల వర్షాలు కురవడం, చల్లటి వాతావరణం ఏర్పడటంతో జనం సేదతీరారు.



గతంలో తనిఖీల సందర్భంగా పట్టుబడ్డ బయో మందులు

నకిలీల నియంత్రణకు చర్యలు

- పట్టుబడితే క్రిమినల్ కేసులే
- రసీదులు, సంచులను దాచండి
- పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నకిలీ విత్తనాల తయారీ, విక్రేతలపై క్రిమినల్ కేసులు నమోదుతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఐ.మురళి అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో విత్తన దుకాణాలపై విస్తృతంగా తనిఖీలు చేస్తామన్నారు. నకిలీ విత్తనాలు అమ్మేవారి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీనిపై ఆయన ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయ శాఖాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు. సాగు సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిఊఆరు. నకిలీ విత్తనాల ఉత్పత్తి, సరఫరా, విక్రయాలను అరికట్టడానికి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ శాఖతో కలిసి ప్రత్యేక స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తనిఖీలు, అవగాహన సదస్సు నిర్వహిస్తామని అన్నారు. నకిలీలపై సమాచారం అందితే తక్షణమే తమ పరిధిలోని వ్యవసాయాధికారికి సమాచారం ఇవ్వాలని కోరారు. గుర్తింపు పొందిన డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనాలని, రసీదు తప్పకుండా తీసుకొని దానితోపాటు విత్తన సంచులను పంట కాలం పూర్తయ్యే వరకూ భద్రపరచాలని రైతులకు సూచించారు.

ప్రేక్షకులను మంత్రముగ్దులను చేస్తున్న నాటిక ప్రదర్శనలు

రెండో రోజుకు చేరిన కొలంకపురి నాటక కళా పరిషత్ ఆహ్వాన నాటిక పోటీలు

5లో



కొత్తపరిమళం నాటికలో సన్నివేశం

సర్వీసు ఓటర్లు ఓటుహక్కు వినియోగం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన సర్వీస్ ఓటర్లు ఎలక్ట్రోనికల్లీ ట్రాన్స్మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీపిబిఎస్) ద్వారా ఓటింగ్ చేసి పోస్ట్ చేసిన కవర్లను శుక్రవారం కలక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డికి పోస్టల్ శాఖాధికారులు పోటీలో వున్న అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో అందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పోటీలో వున్న అభ్యర్థులు , వారి ప్రతినిధుల సమక్షంలో ట్రెజరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ తాళాలు తెరిచి కవర్లను భద్రపరిచి తిరిగి స్ట్రాంగ్ సీజ్ చేశారు.



కలెక్టరేట్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న సర్వీసు ఓటర్లు



వెంకట లక్ష్మయ్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - వినుకొండ

డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీ స్థాపించి దేశం గర్వించదగ్గ ఉత్తమ విద్యార్థులను తయారు చేస్తున్న డాక్టర్ పారా వెంకట లక్ష్మయ్య సేవలు అభినందనీయమని జాషువా సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు, విశ్రాంత మండల విద్యా శాఖ అధికారి సిహెచ్. జాన్ సుందర్‌రావు అన్నారు. స్థానిక చెక్ పోస్ట్ సెంటర్‌లో నూతనంగా ప్రారంభించిన డాక్టర్ లక్ష్మయ్య ఐఐటి, నీట్ అకాడమీలో శుక్రవారం వెంకట లక్ష్మయ్య ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జాషువా సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు మాట్లాడుతూ గురువులపై వినయ విధేయతలు, ఉన్నత భావాలు కలిగిన వ్యక్తి లక్ష్మయ్య అని కొనియాడారు. జాతీయస్థాయిలో విద్యా బోధన విద్యాలయాన్ని వినుకొండలో ఏర్పాటు చేయడం ఈ ప్రాంత విద్యార్థులకు మేలు చేస్తుందని అన్నారు. వెంకట లక్ష్మయ్య మాట్లాడుతూ దేశ, రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీ పరీక్షల్లో వినుకొండలోని లక్ష్మయ్య ఐఎఎస్ స్టడీ సర్కిల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి దేశ ప్రజల దృష్టిలో నిలుస్తారని అన్నారు. కార్యక్రమంలో జాషువా సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షులు, ప్రతినిధులు జి. కమలారామ్, ట్రెజరర్ భాగవతుల రవి కుమార్, ప్రసన్న, పిడుగు విజయ్, దేవా సి.జి.బి బ్యాంక్ మేనేజర్ వెంకట్, అకాడమిక్ డైరెక్టర్ పంకజ్ దుప్రా తదితరులు పాల్గొన్నారు.

పల్నాడులో అలర్లపై 'సిట్'

(మొదటి పేజీ తరువాయి)

నరసరావుపేట నియోజకవర్గాల్లో ఈనెల 13, 14, 15 తేదీల్లో ఘర్షణలు జరిగాయి. కొన్నిచోట్ల వైసిపి వారు రెచ్చిపోగా మరికొన్ని చోట్ల టిడిపి వారు రెచ్చిపోయారు. నరసరావుపేటలో జరిగిన ఘర్షణలు ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆయన ప్రత్యర్థి, టిడిపి అభ్యర్థి చదలవాడ అరవిందబాబు గ్రూపుల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరిగింది. శ్రీనివాసరెడ్డిని హత్య చేసేందుకు అరవిందబాబు కుట్ర చేశారని వైసిపి వారు అభియోగం మోపారు. ఇరు పక్షాలు ఘర్షణ పడుతున్నా తక్కువ మంది ఉన్న పోలీసులు వీరిని నియంత్రించడానికి తీవ్రంగా శ్రమించారు. పోలీసులంతా ఎన్నికల విధుల్లో ఉండగా టిడిపి, వైసిపి మధ్య ఘర్షణలు పట్టణంలో తీవ్ర భయాందోళనలను కలిగించింది.

మాచర్ల నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, టిడిపి అభ్యర్థి బ్రహ్మారెడ్డి మధ్య నెలకొన్న ఆధిపత్య పోరాటం ఈ ఎన్నికల్లో హింసకు దారితీసింది. ఎంతో కాలంగా నియోజకవర్గానికి దూరంగా ఉంటున్న బ్రహ్మారెడ్డి రెండేళ్ల క్రితం టిడిపి మాచర్ల ఇన్‌ఛార్జిగా వచ్చిన తరువాత ఈ ఘర్షణలు మరింతగా పెరిగాయి. వైసిపి ప్రభుత్వ హయంలో టిడిపి వారిని పూర్తిగా నియంత్రించి పిన్నెల్లి సోదరులు ఆధిపత్యం ప్రదర్శించారు. ఎన్నికల షెడ్యూలు వెలువడగానే టిడిపి వారు కూడా ఢీ అంటే ఢీ అనే పరిస్థితిని వెళ్లడంతో ఘర్షణలు తలెత్తాయి. వీటిని నియంత్రించడంలో పోలీసు యంత్రాంగం విఫలం కావడంతో శాంతిభద్రతల సమస్య తలెత్తింది.

గురజాల నియోజకవర్గంలో టిడిపి, వైసిపి మధ్య కూడా ఘర్షణలు జరిగాయి. కొత్తగణేసునిపాడులో టిడిపి వారే వైసిపి వారిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారు. మాచవరంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పెదకూరపాడు మండలంలో అచ్చంపేట, కొత్తపల్లి, వేల్పూరు, దొడ్లేరు, కంభంపాడు, హుస్సేన్‌నగరం, ఎర్రబాలెం, చింతపల్లి గ్రామాల్లో వైసిపి వారిపై టిడిపి వారు దాడులు చేశారు. కంభంపాడులో సర్పంచ్‌పై హత్యాయత్నం జరిగింది. దొడ్లేరులో వైసిపి నాయకులను రోడ్లపై పడేసి కొట్టారు. సత్తెనపల్లి, ముప్పాళ్ల మండలాల్లో కూడా టిడిపి, వైసిపి నాయకుల మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణలు మళ్లీ జరగకుండా ప్రస్తుతం జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొని తెచ్చుకుంటున్న అనారోగ్యం!

- రసాయన వినియోగంతోనే మామిడి నిగనిగలు
- సొమ్ము చేసుకుంటున్న మామిడి పండ్ల వ్యాపారులు
- మోసపోతున్న కొనుగోలుదారులు





ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వేసవి కాలం వచ్చిందంటే నిగ నిగ లాడుతూ, మంచి రంగులో ఉండే మామిడి పండ్లు నోరూరిస్తుంటే కొనుగోలు చేయకుండా ఉంటామా! తిందామనుకుని మామిడిపండును కట్ చేస్తే అది పండు కాదు కాయ అన్న విషయం తెలిసి ప్రజలు నిరాశచెందక తప్పట్లేదు. రుచి ఉండకపోగా మెత్తగా అయిపోయి వాసన వస్తున్నాయి. ఏడాదికి ఒకసారి మామిడి పంట వస్తున్న కారణంగా వీటిని తినేందుకు ప్రజలు ఎక్కువ ఆసక్తి కనబరుస్తుంటారు. దీనిని ఆసరాగా తీసుకొని మామిడి పండ్ల వ్యాపారులు ఎంత తొందరగా సొమ్ము చేసుకుందామా అనే ఆలోచన చేస్తున్నారు. అధికశాతం వరావిండి వండ్లకు రసాయనాలతో రంగులు తెప్పిస్తున్నారు. కొందరు వ్యాపారులు, అమ్మకందారులు. పండని మామిడి కాయలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కాయలకు రంగు వచ్చే రసాయనాల దెబ్బతో వాటిని కొనుగోలు చేసే ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

ఇలాంటి మామిడి పండ్లను తినవద్దని వైద్యులు చెబుతున్నారు. రసాయనాల ద్వారా మగ్గబెట్టిన కాయలు సహజంగా మగ్గపెట్టినవా అనేది పరిశీలించి కొనుగోలు చేయాలంటున్నారు. రసాయనాలను నీటిలో కలిపి మామిడి కాయలపై చల్లుతారని, అందుకే పండు మంచి రంగులో వస్తుందని చెబుతున్నారు. ఇలాంటి మామిడి పండ్లు తింటే తలనొప్పి, అలసట, నరాల సమస్యలు, మూత్రాశయ వ్యాధులు, కనురెప్పల వాపు తదితర కంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

ప్రభుత్వ అధికారి ఇంటిపై పెట్రోలు బాంబు దాడి

ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక ఆకుల వారితోటలో ప్రభుత్వ అధికారి డి.చైతన్య ఇంటిపై శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు బాంబు దాడి చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సిఈవో బాధ్యతలు నిర్వహించి, ప్రస్తుతం స్టేట్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ కార్పొరేషన్ జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న డి.చైతన్య ఆకులవారితోటలో ఉంటున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ బాంబుతో దాడి చేశారు. నగరంపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దాడి విషయం తెలిసిన వెంటనే వైసిపి జిల్లా అధ్యక్షులు మందపాటి శేషగిరిరావుతో కలిసి ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి చైతన్య ఇంటికి వెళ్ళి ఆయనను పరామర్శించారు. అనంతరం అప్పిరెడ్డి మాట్లాడుతూ, వివాద రహితుడు, విధి నిర్వహణలో పూర్తి అంకితభావంతో తన పని తాను చేసుకు పోయే నిజాయితి గల ప్రభుత్వ అధికారిగా ఆయన కు పేరుందని చెప్పారు. చైతన్య ఇంటిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనకు బాధ్యులు ఎవరైనా సరే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ప్రభుత్వ అధికారి డి.చైతన్య ఇంటికి వెళ్లి పరామర్శిస్తున్న లేళ్ల అప్పిరెడ్డి

20, 21 తేదీల్లో విజయవాడలో
సూత్రా సమ్మర్ స్పెషల్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సూత్రా ఎగ్జిబిషన్ ఆధ్వర్యంలో ఈ వేసవి కాలంలో విస్తృత శ్రేణిలో సమ్మర్ స్పెషల్ దుస్తుల ప్రదర్శన, అమ్మ కాలు విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో మే నెల 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.ప్రసాద్ తెలిపారు. సూత్రా ఎగ్జిబిషన్‌లో దుస్తులు, గౌన్లు, చీరలు, గృహ అలంకరణ వస్తువులు, కాస్మెటిక్స్, పాదరక్షలు, ఉపకరణాలు వగైరా మరెన్నో విభిన్న డిజైనర్ ఉత్పత్తులను ప్రదర్శిస్తామన్నారు. భారతదేశం అంతటా ఉన్న ప్రతిభావంతులైన భారతీయ ఫ్యాషన్ డిజైనర్లు తమ డిజైన్లను ప్రీమియం కస్టమర్లకు ప్రదర్శించడానికి సూత్రా ఒక వేదిక అని అన్నారు. ఈ ప్రదర్శనలో మహిళల ఎత్నిక్ వేర్, వేడుకలకు ధరించేవి, సంప్రదాయ దుస్తులు, వివాహాలకు కావలసినవి మొదలైనవి లభిస్తాయన్నారు. వార్డ్ రోబ్, ఎలిగేంట్ స్టోర్ డిల్లీహాట్, అపురూప, జైపూర్ వరల్డ్, వి-స్టూడియోస్- రాజస్థాన్, పెహచాన్, లష్, సిక్వియా క్లాతింగ్, రైన్స్-జైపూర్, నూర్ హేండ్ లూం శారీ-చందేరి, లాల్ గలియారా వంటి అనేక డిజైనర్ ఉత్పత్తుల సంస్థలు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయని చెప్పారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

ప్రజాశక్తి-పెదకూరపాడు: మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థి పాతూరి హర్షవర్ధన్ కి శుక్రవారం లాప్టాప్ ను ఎన్నారై భాను ప్రకాష్ చేతుల మీదుగా శుక్రవారం అందించారు. ఎం.భాను ప్రకాష్ ప్రకాష్, కె.కిరణ్, జి.శివయ్య, బి.సిద్దయ్య పాల్గొన్నారు.



'అను' ఇనిస్టిట్యూట్లో అరుదైన చికిత్స

ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడికి విజయవంతంగా శస్త్రచికిత్స

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : అత్యంత అరుదైన వ్యాధితో ప్రాణాపాయంలో ఉన్న ఓ యువకుడికి అను ఇనిస్టిట్యూట్ వైద్యులు పునర్జీవం ప్రసాదించారు. 21 ఏళ్ల వయసున్న స్టీఫెన్ అనే యువకుడు దీర్ఘకాలికంగా కామెర్లు, పొట్టలో అసాధారణంగా నీరు చేరడం వంటి సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నప్పటికీ ప్రయోజనం లేని పరిస్థితుల్లో, ప్రాణాపాయస్థితిలో అను ఇనిస్టిట్యూట్ వైద్యులను సంప్రదించాడు. అవసరమైన పరీక్షల అనంతరం, పేషెంట్ స్టీఫెన్ బడ్-చియారీ సిండ్రోమ్ అనే అత్యంత అరుదైన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. లివర్ నుంచి చెడు రక్తాన్ని తీసుకువెళ్లే రక్తనాళాలన్నీ మూసుకుపోవడంతో ప్రాణాపాయానికి దారి తీసే సమస్యను బడ్-చియారీ సిండ్రోమ్ గా పిలుస్తారు. సాధారణంగా ఈ సమస్యకు లివర్ ట్రాన్స్ప్లాంటేషన్ చేయాల్సివుంటుంది. అధిక వ్యయం, లివర్ డోనర్ తదితర ఇబ్బందుల కారణంగా.. అప్పటికప్పుడు లివర్ మార్పిడి సాధ్యం కాదు కాబట్టి, ప్రత్యామ్నాయ చికిత్సా విధానాన్ని అవలంబించాల్సివచ్చింది. అను ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరో అండ్ కార్డియాక్ ఇంటర్వెన్షనల్ రేడియాలజీ విభాగానికి చెందిన ప్రముఖ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ భవానీశంకర్ ఆధార్యంలో పేషంటుకు అత్యంత సంక్లిష్టమైన చికిత్సను నిర్వహించారు. లివర్ పూర్తిగా పనిచేయని పరిస్థితుల్లో ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉన్నందున హుటాహుటిన చికిత్స చేశారు. డైరెక్ట్ ఇంట్రాహెపాటిక్ పోర్టోకావల్ షంట్ (డిప్స్) చికిత్సను విజయవంతంగా నిర్వహించి పేషెంట్ ప్రాణాలను నిలబెట్టారు. బైపాస్ తరహాలో నిర్వహించే ఈ చికిత్సలో.. కాలేయానికీ, గుండెకు చెడు రక్తాన్ని తీసుకెళ్లే (ఐవీసీ) రక్తనాళానికి మధ్య స్టెంట్ అమర్చి, లివర్ నుంచి చెడు రక్తం సక్రమంగా గుండెకు ప్రసరించేలా చేస్తారు. ఈ చికిత్స అత్యంత క్లిష్టమైనదది. చికిత్సా సమయంలో అధికంగా రక్తస్రావం జరిగి పేషెంట్ ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. అత్యంత సంక్లిష్టమైన డిప్స్ చికిత్సను, అంతర్జాతీయ స్థాయి సాంకేతిక సదుపాయాలతో కూడిన అను ఇనిస్టిట్యూట్ లో డాక్టర్ భవానీ శంకర్ నేతత్వంలోని వైద్య బందం విజయవంతంగా నిర్వహించింది. చికిత్స ఫలితంగా పేషెంట్ స్టీఫెన్ ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడి వేగంగా కోలుకుంటున్నాడు. అత్యంత అరుదైన ఈ చికిత్సకు సంబంధించిన వివరాలను తెలియజేసేందుకు అను ఇనిస్టిట్యూట్ నందు శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ భవానీశంకర్ మాట్లాడుతూ అరుదైన చికిత్సల కోసం మెట్రో నగరాలకు తరలివెళ్లాల్సిన అవసరం లేకుండా, అను ఇనిస్టిట్యూట్‌లో అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అత్యంత క్లిష్టమైన చికిత్సను నిర్వహించేందుకు సహకరించిన అను ఇనిస్టిట్యూట్ క్యాథ్ ల్యాబ్ బృందానికి డాక్టర్ భవానీశంకర్ ధన్యవాదాలు తెలిపారు. అరుదైన చికిత్సను విజయవంతంగా నిర్వహించి, అను గ్రూప్ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసిన డాక్టర్ భవానీశంకర్ బృందాన్ని అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ జి.రమేష్ అభినందించారు.



చికిత్స చేయించుకున్న యువకుడితో వైద్యులు

పురోగమనంలో మొక్కజొన్న ధరలు

ప్రజాశక్తి - పొన్నూరు

మొక్కజొన్న రైతులకు అనుకూల వాతావరణం, ఆశించిన గిట్టుబాటు ధర పలుకుతుండటంతో రైతులు తమ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది రబీ సీజ సాగునీరు లేకపోయినప్పటికీ రైతులు రెక్కల కష్టాన్ని నమ్ముకుని మొక్కజొన్న సాగు చేశారు. మొక్కజొన్న దిగుబడి సరా సరి ఎకరానికి 30 నుండి 35 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.

గత ఏడాది మొక్కజొన్న 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చినప్పటికీ క్వింటాల్ మొక్క జొన్న రూ.1700 నుండి రూ.1800 ధరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. మొక్కజొన్న రైతులకు నష్టాలు మిగిల్చింది.



మిషన్ ద్వారా మొక్కజొన్న కండెల నుండి విత్తనాలు తీస్తున్న కూలీలు

ఈ రబీ సీజన్‌లో మొక్కజొన్న ధర క్వింటాలు రూ.2,100 నుండి రూ.2,200 .ఆశాజనకంగా ధరలు ఉండటంతో మొక్క జొన్న రైతులు నష్టాల నుండి బయట పడ్డారు. ఈ ఏడాది సాగునీరు అందుబాటులో లేక పోవడం, విన్నర్ రకం మొక్క జొన్న విత్తనం దిగుబడి ఎక రానికి 30 క్విం టాళ్లు మాత్రమే వచ్చింది. మొక్క జొన్నకు ధర పెరగడంతో రైతులు పురో గమించారు. ఈ సీజన్‌లో ఎరువులు, పురుగు మందులు



ఆరబెట్టిన మొక్కజొన్న కండెలు

ధరలు పెరగడంతో మొక్కజొన్న సాగుకు పెట్టుబడి పెరిగి రైతన్నలకు మరింత భారమైంది. కూలీలు, ఆయిల్ ఇంజన్లతో మొక్కజొన్న పొలానికి నీరు చూడటానికి ఆయిల్ ఖర్చులు పెరిగాయి. ఎకరా భూమికి కౌలు రూ.40 వేల నుండి రూ.45 వేలకు పెరగటంతో రైతుల పై మరింత భారం పడింది. అయినప్పటికీ మొక్కజొన్న ధర ఆశాజనకంగా ఉండటం తో రైతులను లాభాల దిశగా నడిపించింది. పొన్నూరు మండలంలో 3 వేల హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేశారు.

సబ్సిడీపై ఎరువులు,పురుగుమందులు ఇవ్వండి



నున్న వెంకటేశ్వర్లు, రైతు, కట్టెంపూడి

ప్రభుత్వం రైతులకు రబీ సీజన్ లో పురుగు మందులు, ఎరు వులు అందజేయాలి. రైతులు నష్టపోకుండా మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలి.

ఉప్పలపాడు సమీపంలో రోడ్డు ప్రమాదం

ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విజయవాడ నుండి విను కొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మరో వాహ నాన్ని దాటి వెళ్లే క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న నరసరావు పేట మండలం పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన ప్రదీప్, అల్లూరి వారిపాలెం గ్రామా నికి చెందిన శేఖర్ లకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రు లను 108 వాహనం ద్వారా లింగంగుంట్ల గ్రామ పరిధిలోని ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు ఆటోను బలంగా ఢీ కొనడంతో ఆటో తిరగబడింది.

పల్నాడు వ్యాప్తంగా కేంద్ర బలగాలతో చెక్‌పోస్టులు పెట్టండి

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

వైకాపా ఎమ్మెల్యేలు, రౌడీ నాయకులు సరిహద్దులు దాటి పోకుండా పల్నాడు జిల్లా మొత్తం కేంద్ర బలగాల ఆధ్వర్యంలో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయుకులు, వినుకొండ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు ఈ విషయమై శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.నిందితులను రాష్ట్ర పోలీసులు దగ్గరుండి ఊర్లు దాటించే ప్రమాదం ఉన్నం దునే కేంద్ర బలగాలు కావాలని కోరుతున్నట్లు తెలిపారు. పోలీసుల గృహ నిర్భంధంలో ఉన్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరుల పరారీనే అం దుకు ఉదాహరణ అని అన్నారు. ఈ సంఘటన అధికార వైసిపి-పోలీసుల మధ్య ఉన్న ఫెవికాల్ బంధాన్ని మరోసారి ప్రజల ముందు ఉంచిదని విమర్శించారు. పోలీసుల తీరు తీవ్ర ఆక్షేప ణీయంగా కనిపిస్తోందని, అసలు ఎన్నికల సంఘం ఎన్నిచర్యలు తీసు కున్నా, పై స్థాయిలో ఎందరు అధికారులను మార్చినా అధికార వైసిపికి పోలీసుల సేవలు ఆగడం లేదని చెప్ప డానికి ఇంతకంటే ఏం కావా లని ప్రశ్నించారు రాష్ట్ర వ్యాప్తంగా సంచల నంగా మారిన కారంపూడి ఘటనలో అరెస్టు భయంతోనే ఎమ్మెల్యే పిన్నెల్లి తప్పించుకుపోయారని, ఆ విషయాన్ని క్షేత్ర స్థాయిలో ఉన్న పోలీస్ సిబ్బందే అతడికి లీక్ చేశారని ఆరో పిం చారు. పోలీసులను కొట్టి, బాంబులు వేయించిన వారిని ఎలా వదిలిపెడతారని విస్మయం వ్యక్తం చేశారు. ఈ మాత్రం దానికి వారిని గృహనిర్భంధంలో దేనికని ప్రశ్నించారు. గురజాల, నరసరావు పేట, వినుకొండ వైసిపి నేతల కదలికలను కూడా పోలీసులు అనుక్షణం గమనిస్తూ ఉం డాలని విజ్ఞప్తి చేశారు. నిజానికి పోలింగ్‌కు కొన్ని రోజుల ముందే మాచర్ల నియోజకవర్గం దుర్గిలో నాటు బాంబులు, మారణాయుధాలు దొరికినా అక్కడ హింసను ఎందుకు అంచనా వేయలేక పోయారని ప్రశ్నించారు. ఎందుకు నియంత్రించ లేక పోయారో ఇప్పటికీ అర్థం కావడం లేదని ,అవన్నీ తేలే లోపే పిన్నెల్లి సోదరులు పారిపోవడం మరెన్నో అనుమానాలకు తావిస్తోం దని అన్నారు. పల్నాడు జిల్లాలో ఇప్పటికీ కొం దరు డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, వైసిపికి తొత్తుల్లా పనిచేస్తున్నారని, సిట్ దర్యాప్తులో వారందరిపై దృష్టి పెట్టి చీడపురుగులను ఏరిపారేయాల్సిన అవసరం ఉందని అభి .ప్రాయపడ్డారు.

CHANGE OF NAME

Kandula Naga Raju (Aadhar No.XXXX XXXX 3205),S/o Venkatrao, D.NO : 4-52 ,SC Colony, Muppalla village, PO & Mandal ,Guntur District, AP-522408. I hereby declare that, I have changed my daughter name from **Kandula Dilshitha** to **Kandula Dhilshitha** (Aadhar No : 8864 1484 7789),D/o Kandula Naga Raju in all records such as Aadhar and DOB Certificate and study records

పల్నాడులో హింసాత్మక ఘటనలపై

రెండ్రోజుల్లో నివేదికివ్వాలని ఈసీ ఆదేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఎన్నికల నేపథ్యంలో పల్నాడు జిల్లాలో వాటిల్లిన హింసాత్మక ఘటనల కారణంగా జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను బదిలీ చేయడంతో పాటు ఎస్పీ బిందుమాధవ్‌ని సస్పెండ్ చేస్తు న్నట్లు కేంద్రం ఎన్నికల సంఘం ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ఎన్నికల సంఘం ఆయా ఘటనలకు సం బంధించి మొత్తం వ్యవహారంపై 2 రోజులలో సిట్ నివేదిక సమర్పించాలని, ఏపిలో ఎన్నికల హింసపై నమోదైన ప్రతి కేసును ప్రత్యేకంగా తీసుకోవాలని, సిట్ ఏర్పాటు చేసి విచా రించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఆయా ఘటనలకు సంబంధించి నిందితులపై ఎఫ్.ఐ.ఆర్ లు నమోదు చేసి ఐపిసి ఇతర సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలో మరో 15 రోజులు సమస్యాత్మక ప్రాంతాలలో వివా దాలు సద్దుమణిగే వరకు కేంద్ర బలగాలను కొనసాగిం చాలంటూ కేంద్ర హోంశాఖకు ఆదేశాలు జారీ చేసింది. హింసా త్మక ఘటనలపై కఠినంగా వ్యవహరించాలని సి.ఎస్, డిజిపికి సూచించింది.



అల్లరిమూకలపై రబ్బరు బుల్లెట్లతో కాల్పులు జరుపుతున్న పోలీసులు (ఫైల్ ఫోటో)

సిపిఎం అభిమాని గడ్డం జయన్న మృతి

సిపిఎం, సిఐటియు సంఘాల సంతాపం

ప్రజాశక్తి-సత్తెనపల్లి



గడ్డం జయన్న

అనారోగ్యంతో సిపిఎం సభ్యులు, భవన నిర్మాణ కార్మికులు గడ్డం జయన్న మృతి చెందారు. పట్టణంలోని 19వ వార్డుకు చెందిన గడ్డం జయన్న భవనిర్మాణ కార్మి కునిగా సెంట్రింగ్ మేస్త్రి గా పనిచేస్తూ జీవ నం సాగిస్తున్నారు. ఆయన గత కొన్ని రోజు లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం, సిఐటియు సంఘాల నాయకులు శుక్రవారం ఉదయం జయన్న భౌతికకాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. జయన్నకు భార్య,కుమారుడు, కుమార్తె ఉన్నారు. జయన్న అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం ఆయన స్వగృహం నుండి జరిగాయని కుటుంబ సభ్యులు తెలిపారు. జయన్న భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించిన వారిలో సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, పట్టణ నాయకులు అనుముల వీరబ్రహ్మ, కట్ట శివ దుర్గారావు, పంతంగి ప్రభాకర్ అనంత వెంకట్ నారాయణ, గడ్డం సుస్సులోవ్ తోటి భవన నిర్మాణ కార్మికులు అవ్వారు ప్రసాదరావు, గొట్టం ఏడుకొండలు,గొట్టిపాటి సాల్మన్ రాజు, పట్టణ ప్రముఖులు షేక్ జలీల్, సయ్యద్ మహబూబ్ ఉన్నారు.



జయన్న భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అసత్య వార్తలపై కఠిన చర్యలు : ఎఎస్‌పి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : పోలింగ్ రోజు, ఆ తర్వాత జరిగిన ఘటనలకు సంబంధించి నిరాధార వార్తలు, అబద్ధపు సమాచారాన్ని పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాల్లో ప్రచురించినా, ప్రసారం చేసినా వారిపై చట్టపరపమైన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఆర్.రాఘవేంద్ర హెచ్చరించారు. వీటిని తీవ్రంగా పరిగణిస్తామని, వాట్సప్, ఇతర సామాజిక మాధ్యమ గ్రూపుల్లో తప్పుడు సమాచారం ప్రచారం చేస్తే గ్రూప్ అడ్మిన్‌దే పూర్తి బాధ్యతని అన్నారు. గతంలో ఎప్పుడో జరిగిన సంఘటనలను ప్రస్తుతం జరిగిన సంఘటనలుగా చిత్రీకరించి ప్రచారం చేస్తే పోస్ట్ చేసినవారిపై క్రిమినల్ చర్యలుంటాయన్నారు. వ్యక్తిగత దూషణలు, ట్రోలింగ్, తప్పుడు వార్తల ప్రసారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, సరైన సమాచారం లేకుండా, ప్రజలను తప్పుదోవ పట్టించేలా నిరాధార, అవస్తావ పోస్టులు, వీడియోలు, వార్తలు సామాజిక మాధ్యమాల్లో ఉంచిన వారితో పాటు అడ్మిన్‌పై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గ్రూప్‌లో యాడ్ చేసే ప్రతి సభ్యుడు తప్పకుండా అడ్మిన్‌కి తెలిసి ఉండాలని, ఎవరైనా సభ్యులు అభ్యంతకరంగా ప్రవర్తిస్తే వెంటనే గ్రూప్ నుండి తొలగించాలని, అభ్యంతకర, ఫేక్ న్యూస్, వదంతులుపై స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలని, వివాదస్పద పోస్టింగ్ సంబంధించి ఐపిసి 153ఎ, సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. కుల, మత, రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టేవి, తప్పుడు సమాచారం, అసభ్యకర, అభ్యంతర, నేరపూరితమైన, బెదిరింపులకు పాల్పడేవి, వ్యక్తిగత పరపతి, మనోభావాలు దెబ్బతీసే విధంగా మార్ఫింగ్ చేసిన ఫొటోలు/వీడియోలను ఎట్టి పరిస్థితుల్లోనూ షేర్ చేయకూడదన్నారు. అసభ్యకర, అభ్యంతరకర పోస్టులకు సంబంధించి సమాచారం పోలీసులకు ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.



కొనసాగుతున్న 144 సెక్షన్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : పల్నాడు జిల్లాలో ఎన్నికల అనంతరం జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా సత్తెనపల్లి పట్టణంలో విధించిన 144 సెక్షన్ శుక్రవారమూ అమలైంది. దుకాణాలు, వివిధ వ్యాపార సంస్థలను మూసేశారు. పోలీసులు దగ్గరుండి దుకాణాలు మూయించారు. దుకాణాలు తీసిన వ్యాపారులను అదుపులోకి తీసుకున్నారు. దుకాణాలు తీస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మూడ్రోజులుగా దుకాణాలు మూసివేయటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జగనన్న సురక్ష, ఎన్నికల విధుల పారితోషికం ఇవ్వాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : వైద్యారోగ్య శాఖలో గౌరవ వేతనంతో పనిచేస్తూ విశేష సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలకు వివిధ సందర్భాల్లో ప్రభుత్వం చేయించుకున్న పనులకుగాను అవెన్సులు తప్పనిసరిగా ఇవ్వాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. ఆశా కార్యకర్తలతో ప్రభుత్వం జగనన్న సురక్ష క్యాంపుల్లో పని చేయించిందని, ఎన్నికల విధుల్లోనూ వారు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఆశాలకు అదనపు వేతనం ఇవ్వాలని యూనియన్ ఆధ్వర్యంలో కమిషనరేట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు వినతిపత్రాను ఎన్నికలకు వారం ముందే ఇచ్చినా సంబంధిత అధికారులు ఇంకా స్పందించలేదని పేర్కొన్నారు. ఇతర శాఖల ఉద్యోగులతో సమానంగా ఆశా వర్కర్లు సైతం ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకూ విధుల్లో ఉన్నారని, వారిని విస్మరించడం సరికాదని అభిప్రాయపడ్డారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో ఆశాలు కీలకపాత్ర పోషించారని, ఎఎన్ఎంలకు ఇచ్చిన మాదిరి పారితోషికం ఆశాలకూ ఇవ్వాలని, వారి ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకుంటే రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ప్రలోభాలను అరికట్టడంలో ఎన్నికల కమిషన్ విఫలం : సిపిఎం



విలేకర్లతో మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో తీవ్రంగా జరిగిన మద్యం, డబ్బు పంపిణీని అరికట్టడంలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైందని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ విమర్శించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తే ఈ ప్రలోభాలు, డబ్బు పంపిణీ వంటి వాటిని నిరోధించడానికి అవకాశం ఉంటుందని, ఆ దిశగా ఎన్నికల కమిషన్ ఆలోచించాలని కోరారు. పోలింగ్ అనంతరమూ ఘర్షణలు జరుగుతున్నాయని, ఎన్నికల కమిషన్ పటిష్టంగా ఉంటే ఇలా జరిగేది కాదని అన్నారు. అధికారులపై చర్యలు తీసుకుంటే సరిపోదని, ఘర్షణలకు కారణాలు తెలుసుకుని ఇకనైనా కఠిన చర్యలు చేపట్టాలని, కారకులను శిక్షించాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు చిలకలూరిపేటలో 2,816 ఉండగా ఒకదాని బదులు మరో ఇవిఎం ఇచ్చారని, రీపోలింగ్‌లో 1219 ఓట్లు పోలవ్వగా 35 మిగిలాయని, దీనికి ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు.పనుల్లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఉపాధి హామీ పనులు కల్పించాలని, ఏడాదిలో 200 పనిదినాలు అమలు చేయాలని కోరారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లులు ఉండేవని, ప్రస్తుతం సగానికిపైగా మిల్లులు మూతబడి కార్మికులకు పనుల్లే కుండా పోయాయని అన్నారు. పరిశ్రమల్లో నెలకొన్న సమ స్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, కార్మికులు ఉపాధి కోల్పోకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, సాగు నీరు సరిగా సరఫరా చేయడానికి ప్రణాళికలు వేయాలని అన్నారు. ఈ ప్రాంతంలో 65 శాతంగా ఉన్న కౌల్దార్లకే రైతు భరోసా దక్కేలా చూడాలని కోరారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ వరికపూడిసెల ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యమిచ్చి పూర్తి చేయాలన్నారు. గ్రానైట్ పేరుతో యడవల్లి దళితులకు చెందిన 416 ఎకరాల భూములను బలవంతంగా తీసుకున్నారని, అయితే 223 ఎకరాలకే నష్టపరిహారం చెల్లించారని తెలిపారు. ఆ భూములన్నింటినీ దళితులకు తిరిగి స్వాధీనం చేయడంతోపాటు వారు వ్యవసాయం చేసుకునే వీలు కల్పించాలని డిమాండ్ చేశారు. చిలకలూరిపేట మీదుగా రైల్వేలైన్ నిర్మించాలని, ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెరగడానికి ఇది దోహదపడుతుందని అన్నారు. ప్రస్తుతం కౌలు రైతులు ఒప్పందాలు చేసుకుంటున్నారని, వ్యవసాయానికి సంబంధించిన అన్ని ప్రోత్సాహకాలు, రాయితీలు కౌల్దార్లకే అందించాలని కోరారు. రైతు భరోసాను కౌల్దార్లకు అందించాలని, ఈ పథకం కింద ఓసీలను మినహాయించడం తగదని అన్నారు. గ్రామ సభల ద్వారా కౌల్దార్లను గుర్తించి వారందరికీ గుర్తింపు కార్డులు అందించాలన్నారు. వీటన్నింటిపై రానున్న ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, యడ్లపాడు మండల కన్వీనర్ టి.కోటేశ్వరరావు, నాయకులు ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.

మెత్తటి మట్టితో చక్కటి బొమ్మలు..



ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు అభివృద్ధి కమిటీ నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో శుక్రవారం మట్టితో వివిధ రకాల బొమ్మల తయారీపై క్రాఫ్ట్ ఉపాధ్యాయులు లంక లక్ష్మణరావు శిక్షణిచ్చారు. మండల కేంద్రమైన యడ్లపాడులోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిర్వహిస్తున్న శిబిరంలో నిర్వాహకులు కె.రామబ్రహ్మం మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మక పెరగటానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని, వారిలో మానసిక స్థైర్యాన్ని పెంచడానికి, నూతన ఆలోచనలు చేయటానికి ఉపయుక్తమని అన్నారు. పోపూరి రామారావు (పిఆర్) విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు ఎన్.కాళిదాసు మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణ శిబిరం విద్యార్థులకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని అందించటం ఒకటే కాకుండా వారి మానసిక పరిపక్వత పెంపొందించడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. మట్టితో బొమ్మలు తయారీ కార్యక్రమం వల్ల నూతన ఆవిష్కరణ చేయటానికి, తద్వారా సామాజిక అభివృద్ధిలో వారు భాగస్వామ్యులు కావటానికి దోహదకారి అవుతుందన్నారు. శిబిరంలో 120 మంది విద్యార్థులు దాదాపు 5 గంటల పాటు ఉత్సాహంగా పాల్గొన్నారు. మెత్తటి మట్టితో చక్కటి బొమ్మలు తయారు చేయడంతోపాటు వాటిని ఒకరికొకరు చూపించుకుని



మురిసిపోయారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పి.వెంకటేశ్వర్లు (చిన్న), ప్రిన్సిపల్ సిహెచ్ సృజన, ఎ.వంశి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హోరాహోరీ పోరులో నెగ్గేదెవరు?

- **మచర్ల అసెంబ్లీ స్థానం గెలుపుపై ఎవరి ధీమా వారిది**
- **తమదే పైచేయి అవుతుందంటున్న వైసిపి, టిడిపి**

ప్రజాశక్తి - మాచర్ల

రాష్ట్రంలోనే అత్యంత సమస్యాత్మక నియోజకవర్గంగా ప్రత్యేక గుర్తింపు ఉన్న మాచర్లలో అందరు ఊహించిన ట్లుగానే దాడులు, ప్రతి దాడులు హింసతో అట్టుడికింది. హింస, దౌర్జన్యాల మధ్య కూడా ఓటర్లు చైతన్యంతో తమ ఓటు హక్కుని వినియోగించుకోవటంతో మాచర్ల నియోజకవర్గంలో అత్యధికంగా 83.75 శాతం పోలింగ్ నమోదైంది. ఈ నేపథ్యంలో వివిధ సామాజిక తరగతులు, మహిళలు, యువత, పెద్దలు, కార్మికులు, రైతులు, కూలీలు ఇలా వివిధ తరగతులకు చెందినవారు ఎటువైపు మొగ్గుచూపారో ఇరు పార్టీలకు చెందిన నాయకులు అంచనాలు వేసుకుంటున్నారు. తమకు అనుకూలంగా ఏ గ్రామాల్లో ఓట్లు వచ్చి ఉంటాయి.. ఏ గ్రామం ఏకపక్షంగా ఏ పార్టీకి ఓట్లు వేసి ఉంటాయి.. అనే లెక్కలు తీసి గెలుపుపై ఎవరికి వారు అంచనాలు వేస్తున్నారు. తమ అభ్యర్థుల గెలుపు కోసం వైసిపి, టిడిపి శ్రేణులు పోలింగ్ రోజున తీవ్రంగా కృషి చేశారు. దాడులు, ప్రతి దాడుల్లోనూ భాగమయ్యారు. పోలింగ్‌కు 3 రోజుల ముందు నుండే ధనం, మద్యంతో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఇరు పార్టీలు పోటి పడ్డాయి. పోలింగ్ జరిగిన సరళిని బట్టి ఆయా పార్టీల నాయకుల వ్యూహాలను బట్టి గెలుపుపై ఎవరి ధీమా వారికి ఉంది. ఇదే క్రమంలో గెలుపు ఓటములపై ఇరు పార్టీలకు చెందిన కొందరు బెట్టింగులకు పాల్పడుతున్నట్లు తెలిసింది?

వైసిపి అంచనా...

వైసిపి తరుపున పోటి చేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వరసగా నాలుగు సార్లు గెలిచి ఐదోసారి బరిలో నిలిచారు. 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా చేసిన ఆయనకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అనుచరగణంతో పాటు మంచి



పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, జూలకంటి బ్రహ్మానందరెడ్డి

పట్టుంది. ఆయనతోపాటు అతని సోదరుడు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వీరి పాలనా సమయమంతా టిడిపికి చెందిన మొదటి, రెండవ, మూడవ శ్రేణి క్యాడర్‌ను తమ వైపుకు తిప్పుకోవటంతో టిడిపికి దారి చూపే నాయకులు లేకుండా చేశారు. దీంతో ఏకపక్షంగా గత మున్సిపల్, పంచాయతీ తదితర స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నిచోట్లా తమదైన శైలిలో ఏకగ్రీవం చేసుకోన్నారు. దీంతో ప్రతి గ్రామంలో వైసిపికి చెందిన నాయకుడే అధికారం చెలాయించటంతో ప్రతిపక్ష పార్టీకి బలం లేకుండా పోయింది. గత ఎన్నికలలో టిడిపిలోని అసమ్మతి వర్గం సహాయ, సహకారాలు ఉండటంతో రామకృష్ణారెడ్డికి విజయం సులువుగా దక్కింది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు తమకు మద్దతుగా ఉన్నందున ఇప్పుడూ గెలుస్తామని వైసిపి అంచనా. వైసిపికి ఏకపక్షంగా ఓట్లు తెచ్చే గ్రామాలైన కళ్లకుంట, కెపిగూడెం, రెంటాల, మిర్యాల గ్రామాల్లో ఈసారి కూడా ఆ ఏకపక్షత కొనసాగిందని భావిస్తున్నారు. ప్రతిపక్షం కంటే ఎక్కువగా డబ్బు పంచటం తమకు అనుకూలించినట్లు ధీమాగా ఉన్నారు. కోద్దో, గోప్ప ఉన్న వ్యతిరేకతను ధన ప్రభావంతో అధిగమించినట్లు భావిస్తున్నారు. టిడిపికి ఏకపక్ష అనుకూలంగా ఓట్లు వచ్చాయని కొన్ని గ్రామాలను టిడిపి శ్రేణులు చెబుతున్నా.. అదేమీ లేదని, మధ్యాహ్నం వరకు తమ ఏజెంట్లు ఉండి సజావుగా పోలింగ్ జరగటంతో వైసిపికి మద్దతుగా ఉండే వారు అత్యదిక శాతం ఓటేశారని వైసిపి శ్రేణులు చెబుతున్నాయి. ఏదేమైనా 3 నుండి 5 వేల మోజారిటీతో తప్పక తాము గెలుస్తామని వైసిపి నాయకులు ధీమాగా ఉన్నారు.

టిడిపి అంచనా....

ఎన్‌డిఎ కూటమి తరుపున టిడిపి అభ్యర్థిగా పోటి చేసిన జూలకంటి బ్రహ్మానందరెడ్డి కార్యకర్తల అండతో టిడిపిని బలోపేతం చేశారు. వైసిపి వైపు వెళ్లిన టిడిపి నాయకులు ఒక్కొక్కరుగా పార్టీలోకి తిరిగి వచ్చారు. ఎన్నికలకు సర్వశక్తులు కూడదీసుకొని పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఢీ కొట్టారు. టిడిపి అనుకూల సామాజిక తరగతి ఉండే గ్రామాల్లో మళ్లీ 20 ఏళ్ల తర్వాత ఏకపక్షంగా ఓటింగ్ జరిగింది. వైసిపి అనుకూల గ్రామాల్లో సైతం మధ్యాహ్నం వరకు ఓటింగ్ జరిగేలా చూడగలిగారు. వైసిపి శ్రేణుల దాడులను ఎదుర్కొన్నారు. 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న రామకృష్ణారెడ్డిపై ఉన్న వ్యతిరేకత తమకు అనుకూలంగా మారి, అవి ఓట్ల రూపంలో తమను గెలిపించబోతున్నట్లు టిడిపి అంచనా. వైసిపితో పోల్చుకుంటే డబ్బులు తక్కువగా పంచినా తమకు నష్టమేమీ లేదని భావిస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తమకు అనుకూలంగా మారినట్లు వారంటున్నారు. తాము భారీ మోజారిటీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు తేదీ, సమయంపై అభ్యర్థులకు నోటీసు ద్వారా సమాచారం అందించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలోని ఇతర నియోజకవర్గాలతో పాటు గుంటూరు తూర్పు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు జరిగే యూనివర్సిటీలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. సెక్టార్, పోలింగ్ కేంద్రాల వారీగా టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుండి ఈవిఎంలు తీసుకొచ్చేందుకు, అధికారులు, లెక్కింపు సిబ్బంది, అభ్యర్థులు, ఏజంట్లు లెక్కింపు కేంద్రంలోనికి వచ్చేందుకు వేరువేరుగా మార్గాలు ఉండాలన్నారు. అవసరమైతే బారీకేడింగ్ ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే సిసి కెమెరాలు స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని, సదరు విజువల్స్‌ని యూనివర్సిటీ ప్రాంగణంలోని కంట్రోల్ రూమ్‌లో చూడవచ్చని అభ్యర్థులకు తెలియచేయాలన్నారు. కౌంటింగ్‌కు అవసరమైన మెటీరియల్ చెక్‌లిస్ట్ సిద్ధం చేయాలని, కౌంటింగ్ విధులకు అధికారులను, సిబ్బందిని కేటాయిస్తూ ప్రొసీడింగ్స్ తయారు చేయాలని మేనేజర్‌ని ఆదేశించారు. జిఎంసిలోని పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్ వద్ద నిరంతరం పోలీస్ భద్రత ఉండేలా మేనేజర్ ప్రసాద్, సూపరిండెంట్ శివన్నారాయణ సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. టేబుళ్ల వారీగ, రౌండ్ల వారీగా ఫలితాలను జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషన్‌కు ఎప్పటికప్పుడు అందించేందుకు అవసరమైన కంప్యూటర్ ఆపరేటర్లు, కంప్యూటర్లు, తగిన ఇంటర్‌నెట్ సదుపాయాలను, వీడియోగ్రాఫర్లను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏఆర్‌ఓలు సునీల్‌కుమార్, భీమరాజు, వెంకటలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ వెంకటకృష్ణయ్య, ఎస్.ఈ. శ్యామ్ సుందర్, ఈఈ సుందర్రామిరెడ్డి, సిఎంఓహెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్‌ఓ మధుసూదన్, మేనేజర్ ఎస్.ఎస్.ప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు, సూపరిండెంట్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నగర కమిషనర్ కీర్తి చేకూరి


మాట్లాడుతున్న ప్రసాద్


మాట్లాడుతున్న డి.రమాదేవి

ఆదర్శ నాయకుడు రాగి సుబ్బారావు

ప్రజాశక్తి-గుంటూరు

సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నేత రాగి సుబ్బారావు సంస్మరణ సభ శుక్రవారం స్థానిక సంగడిగుంట బిఎస్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి వేల్పురి నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. రాగి సుబ్బారావు ఈనెల1వ తేదీన మేడే నాడు అనారోగ్యంతో మరణించారు. ఈ సభలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, ఐఎఫ్‌టియు నాయకులు పి.ప్రసాద్, సిపియం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపియం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిపిఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ నాయకులు మన్నవ హరిప్రసాద్, విరసం నాయకులు సిఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ రాగి సుబ్బారావు ఐదు దశాబ్దాలుగా విప్లవమే వత్తిగా తన జీవితాంతం పనిచేశాడని సోదాహరణంగా వివరించారు. సామ్రాజ్యవాద భూస్వామ్య దోపిడీ పీడనలేని సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం సుబ్బారావు తను పనిచేయటమే కాకుండా తన కుటుంబాన్ని కూడా విప్లవోద్యమానికి అనుగుణంగా తీర్చిదిద్దారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకుడు ముప్పాళ్ళ భార్గవ, ప్రజాపోరు నాయకులు పాటిబండ్ల కోటేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ప్రముఖ సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరరావు, ప్రొఫెసర్ షేక్.అబ్దుల్ నూర్‌భాషా, యంసిపిఐ నాయకులు కాల్వ శ్రీధర్, ఓపిడిఆర్ అఖిలభారత అధ్యక్షుడు భాస్కరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ప్రేక్షకులను మంత్రముగ్దులను చేస్తున్న నాటిక ప్రదర్శనలు

రెండో రోజుకు చేరిన కొలంకపురి నాటక కళా పరిషత్ ఆహ్వాన నాటిక పోటీలు

ప్రజాశక్తి-తెనాలి

కళలకు, కళాకారులకు, కళాభిమానులకు, కళాపోషకులకు పుట్టిల్లైన కొలకలూరులో కొలంకపురి నాటక కళాపరిషత్ ప్రదర్శిస్తున్న ఆహ్వాన నాటిక పోటీలు ప్రేక్షకులను మంత్రముగ్దులను చేస్తున్నాయి. ఆద్యంతం రసరమ్యంగా సాగుతున్న నాటిక ప్రదర్శనలు సమీప గ్రామాల నుంచి వచ్చిన ప్రేక్షకులను రంజింపచేస్తున్నాయి. నటీనటులు ఒకరిని మించి మరొకరు పాత్రలకు జీవం పోస్తున్నారు. సమాజానికి సందేశాత్మకంగా, దైనందిన జీవితానికి అత్యంత సమీపంగా కథ, కథనం సాగుతున్నాయి. రూరల్ గ్రామం కొలకలూరు చిన్న రథశాల వద్ద వల్లేపల్లి వెంకట్రామయ్య కళాప్రాంగణంలో కొలంకపురి నాటక కళాపరిషత్, హైదరాబాద్‌కు చెందిన వైకె నాటక కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహ్వాన నాటిక పోటీలు శుక్రవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు గ్రామ మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి వల్లూరి వరప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ రంగస్థల నటులు దేవిరెడ్డి రామ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో డిఎస్ దీక్షిత్ స్మారక పురస్కారాన్ని రంగస్థల నటులు, దర్శకులు ఎన్.రవీంద్రారెడ్డికి ప్రధానం చేశారు. ఆత్మీయ అతిధులుగా రంగస్థల నటులు కాట్రగడ్డ రామకృష్ణ, సుద్దపల్లి శరత్ వెంకయ్య, వైకె నాటక కళాపరిషత్ రథసారధులు డి తిరుమలేశ్వరరావు, జి.మల్లిఖార్జునరావు, జివిజి శంకర్, నాటక విశ్లేషకులు ఆకుల మల్లేశ్వరరావు, నిర్వాహకులు గోప రాజు విజయ్, జి.రమణమూర్తి, కాంతారావు పాల్గొన్నారు.


డిఎస్ దీక్షిత్ పురస్కారాన్ని అందుకుంటున్న రవీంద్రారెడ్డి


మాట్లాడుతున్న రామకోటేశ్వరరావు

ద్వేషం మనిషికి, దేశానికి చేటే

నాటిక ప్రదర్శనల్లో భాగంగా రెండో రోజు తొలి ప్రదర్శనగా సాగిన 'కొత్తపరిమళం' నాటికను శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శార్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం ప్రదర్శించింది. నాటకకు రచన కాండ్రేగుల శ్రీనివాసరావు కాగా, నాటకీకరణ కెకెఎల్ స్వామి, దర్శకత్వ బాధ్యతలను బిఎంఎస్ పట్నాయక్ నిర్వహించారు. నాటిక ఇతివృత్తం సరిహద్దులో దేశ రక్షణ కోసం సైనికుడు పడే తపనకు అద్దం పట్టింది. ఇండియా-పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతంలో యుద్ధ భయంలో ప్రజలు భయంభయంగా కాలం వెళ్ళదీస్తుంటే, సరిహద్దులో మంచుకొండల్లో సైనికుల నరకయాతన, మరోవైపు మనుషుల్లో మానవత్వం కోల్పోయి మత విద్వేషాలు రెచ్చగొట్టడం, ఫలితంగా మనిషి తన సహజత్వాన్ని కోల్పోయి స్వార్ధం, ద్వేషంతో నిండిపోవటం, సమాజంలో నెలకొన్న పరిస్థితులే మనిషి నైజాన్ని మార్చేస్థాయని, చివరికి మనిషికైనా, దేశానికైనా ద్వేషం, స్వార్ధం చేటేనన్న సందేశంతో నాటిక సాగుతుంది.

నోట్ దిస్ పాయింట్...

నిత్యం బస్టాండ్, రైల్వే స్టేషన్, చెత్త కుండీలు, రద్దీ కూడళ్ళలో నిస్సహాయంగా ఉన్న అనాథలను నిర్లక్ష్యం చేయటం, తప్పదన్నట్లు చిల్లర విసిరేసి మనదారిన మనం వెళ్ళిపోవటం, ఫలితంగా వారు సమాజంపై ఏహ్యతా భావాన్ని పెంచుకుని, ప్రమాధకంగా మారటం మానవ తప్పిదంగా నాటిక కధాంశం సాగింది. అలాంటి వారి గురించి ఒక్క క్షణం ఆలోచించి, వారి శ్రేయస్సుకోరి ఏదైనా మేలు చేస్తే వారు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తారన్న సందేశంతో నోట్ దిస్ పాయింట్ నాటిక ఇతివృత్తంగా సాగింది. ఈ నాటికను నరసరావుపేటకు చెందిన మిత్ర క్రియేషన్స్ వారు ప్రదర్శించారు. గంధం నాగరాజు రచనకు ఎస్‌ఎం భాషా దర్శకత్వం వహించారు.

మళ్లీ కలిసి జీవిద్దాం...

భార్యాభర్తల మధ్య అన్యోన్యతలకు దర్పణం ఈ నాటిక. సత్యనారాయణ మూర్తి, లీలావతి భార్యాభర్తలు. వారికి చంద్రశేఖర్, గాయత్రి సంతానం. ఎప్పుడో కుటుంబంలో ఏర్పడ్డ స్పర్ధల కారణంగా కొడుకు చంద్రశేఖర్‌ను, తనకు జరిగిన అన్యాయం గురించి ప్రశ్నించి మళ్ళీ పెళ్ళి చేసుకుందని కుమార్తె గాయత్రిని దూరంగా పెడతారు. ఇరువురు పిల్లలకు దూరంగా జీవిస్తున్న క్రమంలో భార్య లీలావతి మృతితో సత్యనారాయణ మూర్తి ఒంటరౌతాడు. చనిపోయినా తన భార్య లీలావతి బతికే ఉందన్న భావనతో ఆమెతో ఏదో మాట్లాడుతున్నట్టే ఉంటాడు. ఆమె జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆమెతో మళ్ళీ కలిసి జీవిస్తున్నట్టుగానే బావిస్తుంటాడు. భార్య చనిపోయినా అమెతో గడిపిన జీవితాన్ని వల్లెవేసుకుంటే కలిసే జీవిస్తున్నామన్న భావనే 'మళ్ళీ కలిసి జీవిద్దాం' నాటిక సందేశం. న్యూఢిల్లీకి చెందిన శ్రీ కృష్ణా తెలుగు థియేటర్స్ వారి ప్రదర్శనకు రచన శారదా ప్రసన్న. దర్శకత్వం డివి చంద్రశేఖర్ వహించారు.

డిఎంహెచ్‌ఒ ఆఫీసు సిబ్బందికి బిపి పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

వరల్డ్ హైపర్ టెన్షన్‌డే సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉద్యోగులందరికీ నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో బిపి పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్. కే.విజయలక్ష్మి స్వయంగా బి.పి చెక్ చేయించుకొని మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ ఈ సంవత్సరం నినాదం అయిన 'రక్తపోటును ఖచ్చితంగా కొలిచి, నియంత్రణలో ఉంచుకొని, ఎక్కువకాలం జీవించండి' తో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్క ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది అందరూ బి.పి.పరీక్ష చేయించుకోవాలని, బి.పి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులు, సిబ్బందికి సలహాలు ఇస్తూ ఆరోగ్యవంతమైన ఆహారపు అలవాట్లు, ప్రతిరోజూ 30 నిమిషాలు నడక, వ్యాయామము, ధ్యానం, యోగా చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని, ఈ బీపీ సైలెంట్ కిల్లర్ అని, అప్రమత్తంగా లేకపోతే పక్షవాతం, హార్ట్ ఎటాక్, బ్రెయిన్ స్ట్రోక్‌కు దారి తీయడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు బీ.పీ విషయంలో అవగాహన కలిగి ఉండి ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.ఏ.శ్రావణ్‌బాబు, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్సీడీ, డాక్టర్ రత్న మన్మోహన్, డి.పి.ఎమ్.ఓ, డాక్టర్ కె.వి సుబ్బరాజు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి, డాక్టర్ ఈ.అన్నపూర్ణ, డిప్యూటీ డి.ఎం.హెచ్‌ఒ, గిరిధర్ పాల్గొన్నారు.


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న వెంకటేశ్వరరెడ్డి తదితరులు

రోప్ స్కిప్పింగ్‌లో జిల్లా క్రీడాకారులకు పతకాలు

ప్రజాశక్తి-గుంటూరు :ఇండియన్ రోప్ స్కిప్పింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నేపాల్‌లోని కాట్మండులో జరిగిన జాతీయస్థాయి సౌత్ ఏషియన్ రోప్ స్కిప్పింగ్ చైర్మన్‌షిప్ 2024 పోటీలలో గుంటూరు జిల్లాకు చెందిన డి.ప్రగ్న దియా జోస్లిన్ 2 బంగారు పతకాలు, పి.రాజమీనాక్షి 1 బంగారు పతకం, 1 వెండిపతకం, ఎ.మేరి 1 బంగారు పతకం, 1 వెండి పతకం సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులు నవంబరులో తాయ్‌లాండ్‌లో జరగబోయే ఏసియన్ స్కిప్ రోపింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనటానికి బయలుదేరి వెళుతున్న సందర్భంగా ఆయా క్రీడాకారులను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.వెంకటేశ్వరరావు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు సి. హెచ్.వెంకటేశ్వరరెడ్డి, జిల్లా సెక్రెటరీ కొనన వేణుగోపాలరావు, కోచ్ ఇమ్మాన్యుయేల్, గుంటూరు రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ సెక్రెటరీ తిరుపతిరావు తదితరులు అభినందనలు తెలిపారు.



భీమ్ భారత్ ఆధ్వర్యంలో కలేకూరి వర్ధంతి

ప్రజాశక్తి-గుంటూరు : తరతరాలుగా అత్యాచారాలకు, అవమానాలకు, హత్యలకు గురవుతున్న దళిత, బహుజన జాతుల్ని సంఘటిత పరిచేందుకు నిరంతరం శ్రమించి తన కవిత్వం ద్వారా, రచనల ద్వారా చైతన్యం నింపిన గొప్ప విప్లవ యోధుడు కలేకూరి ప్రసాద్ అని బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ అన్నారు. శుక్రవారం అరండల్‌పేటలోని బీమ్ భారత్ కార్యాలయంలో డి.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన కలేకూరి 11వ వర్ధంతి సభలో పాగళ్ల ప్రకాష్ మాట్లాడుతూ కలేకూరి విద్యార్థి దశ నుండి అగ్రవర్ణ భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాల హక్కుల కోసం పోరాడారని అన్నారు. తెలుగు సమాజంలో దళిత దిక్కార కవిగా, ప్రజాపాటల రచయితగా, కారంచేడు, చుండూరు దళిత పోరాటాలకు ఆకర్షితుడై అనేక బాధ్యతలు స్వీకరించాడన్నారు. చుండూరు ఉద్యమంలో పిడికెడు ఆత్మగౌరవం కావాలంటూ నినదించాడన్నారు. కార్యక్రమంలో చిన్నం డేవిడ్ విలియమ్స్, రావినూతల కమల, బత్తుల అనిల్‌బాబు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గుడిపాడు ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న శిఖా శాంసన్

అధిక రక్తపోటుతో జాగ్రత్తగా ఉండాలి

ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శాంసన్

ప్రజాశక్తి- క్రోసూరు

అధిక రక్తపోటుతో జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ అన్నారు శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ఆయన పల్నాడు జిల్లా కోసూరు మండలం గుడిపాడు ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. 'తరచుగా బిపి చెక్ చేయించు కుంటామని, తప్పకుండా బిపికి మందులు వాడతామని, వైద్య అధికారుల సూచ నల మేరకు జీవన శైలిలో మార్పులు చేసు కుంటాం' అని ప్రజలతో ప్రతిజ్ఞ చేయిం చారు ఈ సంద ర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దివ్య మాట్లాడుతూ వ్యాయామం, ఆహారంలో ఉప్పుకారాలను తగ్గించడం, మద్య పానం ధూమ పానం ఆపేయడం వంటివి హై బిపి నియం త్రణలో ఉపకరిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ఝాన్సీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-ఈపూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం తూతూ మంత్రంగా నిర్వ హించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను సమావేశంలో లేవనెత్తడం వాటి పరిష్కారానికి అధికారులు వివరణ ఇవ్వడం తెలిసిందే. అయితే, సమావేశానికి గ్రామ సర్పంచులు హాజరు కాలేదు.ఎంపిపి ఈదర రాధిక కూడా గైర్హాజరయ్యారు. వైస్ ఎంపీపీ గోలి భాగ్యలక్ష్మి, ఎంపిటిసిలు, అధికారులు కొద్దిమంది హాజరయ్యారు. కార్యాలయ సిబ్బంది వారి వద్ద నుండి సంతకాలు తీసుకొని సమావేశాన్ని నిర్వహించామనిపించారు.



పోతులూరయ్యను సత్కరిస్తున్న చిత్రం

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లిలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర 331వ ఆరాధన మహోత్సవం వైభవంగా నిర్వ హించారు. స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలో ఆరాధన మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షులు పోతులూరయ్యాచారి మాట్లాడుతూ సత్తెన పల్లిలో144 సెక్షన్ కొనసాగుతున్న నేపథ్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించలేకపోయినట్లు చెప్పారు. అనంతరం విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు అధ్యక్షులు పోతు లూరయ్యాచారిని సత్కరించారు. కార్యక్రమంలో ఎ.శ్రీని వాసచారి, ఎం.శ్రీనివాసరావు, ఎ.కోటేశ్వరరావు, టి.శంకంరావు, దాసు భాస్కరాచారి, కె.గోపి, ఆర్.నాగభూషణాచారి, ఎం.భాస్కర్, వై.సత్యనారాయణ, సిద్దు ఆంజనేయులు, వై. శివాచారి,ఆంజనేయులు,గోపిక, మధులత, పార్వతి, దాసు కల్పన, చంద్ర కుమారి పాల్గొన్నారు.

కుటుంబాల్లో విషాదం నింపుతున్న రోడ్డు ప్రమాదాలు

- కుటుంబాల్లో విషాదం నింపుతున్న రోడ్డు ప్రమాదాలు
- నిర్లక్ష్యానికి గాలిలో కలిసిపోతున్న నిండు ప్రాణాలు
- డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడుతున్నా మారని తీరు



ఇటీవల రొంపిచర్ల వద్ద జరిగిన ప్రమాదం చిత్రం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అతివేగం ప్రమాదకరమని వాహనాల వెనుక రాసి ఉండటం గమ నిస్తుంటాం. దానికి కేవలం సూక్తిగానే భావి స్తుంటారు కానీ ఇది నిజ జీవితంలో అందరికీ వర్తిస్తుందనే విషయాన్ని మాత్రం తెలుసుకోలేపోతుంటారు. ప్రాణం విలువ తెలియక అతివేగంగా వాహనాలు నడిపిన ఫలితంగా అనేక మంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. దీంతో ప్రమాదాలు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యం మూలంగా ప్రాణాలు పోవడంతో తండ్రికి బిడ్డను.. బిడ్డకు తండ్రిని దూరం చేస్తున్నాయి. అతివేగం వద్దని వాహన దారులకు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా పూర్తి నియంత్రణ సాధ్యం కావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా మద్యం మత్తులోనూ వాహనాలు నడపడం మూలంగా తరుచూ ప్రాణాలు పోవడం అవయవాలు విరిగిపోవడం కారణంగా ఏండ్ల తరబడి మంచానికే పరిమితం కావాల్సి వస్తోంది. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా వీటి నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.మామూళ్లకు అలవాటు పడిన పోలీసులు నామమాత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు.



చిలకలూరిపేట మండలం పసుమర్తిసమీపంలో జరిగిన ప్రమాదం

'తొందరపడకండి.. నిదానంగా వెళ్లండి.. క్షేమంగా తిరిగి రండి' అని పెద్దలు తరుచూ చెబుతుంటారు. పోలీసుల ప్రకటనలోనూ ఇలాంటి సూక్తులు కనిపిస్తుంటాయి. వీటిని చదువుతున్న... వింటున్న వాహనదారులు కేవలం ప్రకటనలు మాత్రమే అనుకుంటున్నారు. ఇవి నిజజీవితంలోనూ పాటించాలని భావించడం లేదు. వీటిని నిజంగా పాటిస్తున్న వారు మాత్రం తరుచూ దూర ప్రయాణాలు చేస్తున్నా క్షేమంగా ఇంటికి తిరిగి వెళ్తున్నారు. పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు మాత్రం ప్రమాదాల బారినపడుతున్నారు. తాజాగా చిలకలూరిపేట మండలంలోని పసుమర్తి గ్రామ సమీపంలో జరిగిన ఘటన ఈ కోవకు చెందిందే. అద్దంకి-నార్కెట్ పల్లి రహదారి మార్గంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రోడ్డు దాటే క్రమంలో రోడ్డు భద్రత నియమాల పట్ల అంతగా అవగాహన లేని రైతులు ఎంతోమంది మత్యువాత పడ్డారు. క్షతగాత్రులను ప్రాథమిక చికిత్స కోసం నరసరావుపేట మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలిస్తున్న క్రమంలో ఎంతోమంది మత్యువాత పడుతున్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక కొత్తలో అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) మండల కేంద్రం రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ గోడ శంకుస్థాపన చేశారు. రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని నాడు ఆయన చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. ఆయా ప్రమాదాలలో మృతి చెందిన కుటుంబాల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి.



నరసరావుపేటలో ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా పిల్లలతో వెళుతున్న పాఠశాల బస్సు(ఫైల్ ఫొటో)

మద్యం మత్తులోనే ప్రమాదాలు

మద్యం మత్తులోనే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలీసుల నివేదికలు సైతం ఇవే దవీకరిస్తున్నాయి. సుమారు 80 శాతం నేరాలు మద్యం మత్తులోనే జరుగుతున్నాయని తెలుస్తోంది. రోడ్డు ప్రమాదాల నివారణకు అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోకపోవడం కారణంగానే తరచూ ఘటనలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి .రోడ్డు ప్రమాదాలపై పటిష్టమైన చర్యలు తీసుకొని రోడ్డు ప్రమాదాలను నివారించే విధంగా అధికారులు చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కీటక జనిత వ్యాధుల బారినపడొద్దు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

దోమల వలన కీటక జనిత వ్యాధులు సంక్రమిస్తాయని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ అన్నారు. సత్తెనపల్లిలోని 10వ సచివాలయం పరిధిలో శుక్రవారం జరిగిన ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. వడ్డవల్లి ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కబేళా బజారు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది, మలేరియా, డెంగీ చికున్‌గున్యా, టైఫాయిడ్, బోదకాలు లాంటి ప్రమాదకరమైన కీటక జనిత వ్యాధులు సోకుతాయని చెప్పారు. అందుకని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ మలేరియా అధికారి బి.పి. చంద్రశేఖర్, మలేరియా సూపర్ వైజర్లు వై.రాజేష్‌పాల్, కె.వి నాగమల్లేశ్వరావు, హెల్త్ అసిస్టెంట్లు కిరణ్ బాబు, షేక్ హుస్సేన్, షేక్ షరీఫ్, హెల్త్ సెక్రటరీ ఎం.భాగ్యరేఖ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో పర్యటిస్తున్న జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్



క్రోసూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది

ప్రజాశక్తి-క్రోసూరు

జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ బాల అంకమ్మ బాయ్ ఆధ్వర్యంలో క్రోసూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సత్తెనపల్లి డివిజన్ వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు. అంకమ్మ బాయ్ మాట్లాడుతూ ఎడిస్ ఈజిప్ట్ అనే దోమ కుట్టడం వలన డెంగీ వ్యాధి వస్తుందని, ఈ వ్యాధికి నివారణ ఒక్కటే మార్గమని అన్నారు. ఈ వ్యాధి లక్షణాలు తీవ్ర తలనొప్పి, జ్వరం, శరీరంపై దద్దుర్లు, కండరాలు, కీళ్ల నొప్పులు అని వివరించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ పనికిరాని పాత్రలు, పాత టైర్లు, నీటి తొట్టెలు, వాడి పడేసిన ప్లాస్టిక్ వస్తువులు, కొబ్బరి బోండాలు, పగిలిన కప్పులు, పాతకుండలు ఇంటి పరిసరాలలో లేకుండా చూసుకోవా లని సూచించారు. దోమల నియంత్రణ మనందరి బాధ్యత అని, 'చేయి చేయి కలుపుదాం, డెంగీని నివారిద్దాం' అని సిబ్బంది నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి సిరి చందన , హెల్త్ సూపర్వైజర్ శివుడు ఆరోగ్య కార్యకర్తలు, ఫార్మా సిస్ట్ ఫాతిమా పాల్గొన్నారు.

20న విజయవాడలో సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి మంగళగిరి

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తొలి పార్లమెంట్ ప్రతిపక్ష నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఈనెల 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు విజయవాడలోని చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియంలో జరిగే దేశ సమైక్యత, ఎదురవుతున్న సవాళ్లు అనే అంశంపై సదస్సు జరుగుతుంది అని ఈ సదస్సులో మంగళగిరి ప్రాంతం నుండి పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎస్ చంగయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ సమావేశం పి బాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో చెంగయ్య మాట్లాడుతూ ఈ సదస్సులో ప్రధాన ఉపన్యాసకులుగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ బి.వి. రాఘవులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. అదేవిధంగా ఈనెల 19వ తేదీన సుందరయ్య వర్ధంతి సందర్భంగా మంగళగిరి పట్టణంలో సిపిఎం పతకాలను ఆవిష్కరిస్తున్నట్లుగా తెలిపారు. పీడిత ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని అన్నారు. అదేవిధంగా అసెంబ్లీ ఎన్నిక సందర్భంగా ఇండియా బ్లాక్ వేదిక తరపున సిపిఎం అభ్యర్థిగా పోటీ చేసిన జొన్న శివశంకర్ విజయానికి కృషి చేసిన సిపిఐ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, సిపిఎం పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఏం చలపతిరావు, జే బ్రాహ్మణి, ఎస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పిల్లలమర్రి బాలకృష్ణ

సినిమా థియేటర్‌లు నడపలేక మూత

ప్రజాశక్తి-తెనాలిరూరల్

- త్వరలో మల్టీప్లెక్స్ థియేటర్లకు తప్పని తిప్పలు
- ఇక్కట్లలో థియేటర్‌ల మీద ఆధారపడ్డ సిబ్బంది
- త్వరలో ఉమ్మడి తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు వినతి
- మా ఎపి వ్యవస్థాపక అధ్యక్షులు దిలీప్‌రాజా

తెలుగురాష్ట్రాల్లో సుమారు 450 సింగిల్ స్క్రీన్ థియేటర్లు శుక్రవారం నుంచి మూతబడ్డాయని మూవి ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు, సిని దర్శకుడు దిలీప్ రాజా ఆందోళన వ్యక్తం చేశారు. తెనాలి పెదరావూరు స్టూడియోలో శుక్రవారం జరిగిన మాఎపి కార్యనిర్వాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ సినిమాలు ప్రదర్శించక తెలంగాణలో పలు థియేటర్లు మూతపడ్డాయని త్వరలో ఎపి మల్టీప్లెక్స్ థియేటర్లు సైతం మూతబడే ప్రమాదం ఉందన్నారు. థియేటర్లలో సినిమా వీక్షించే ప్రేక్షకుల సంఖ్య గణనీయంగా తగ్గడమే దీనికి ప్రధాన కారణమన్నారు. సినిమా థియేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉమ్మడి తెలుగు ప్రభుత్వాలకు మాఎపి బృందం నివేదిక సమర్పించబోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. సినిమాలు ఆడని కారణంగా థియేటర్లలో పనిచేస్తున్న సిబ్బంది జీతభత్యాలు, కరెంట్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకుందన్నారు. తక్కువ ఖర్చుతో నిర్మాణ వ్యయం చేపట్టి హీరోలకి వందలుకోట్లు చెల్లిస్తున్నామన్న సంస్కృతి విడనాడకపోతే చలనచిత్ర పరిశ్రమ సంక్షోభంలో పడుతుందన్నారు. తెలుగు రాష్ట్రాల సిని పెద్దలతో సంప్రదింపులు జరిపి థియేటర్లలో విక్రయించే టికెట్ల ధరలను తగ్గించాలని సూచించారు. అగ్రహీరోల పారితోషకాలను కొంతమేరకు తగ్గించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిని నిర్మాత చదలవాడ హరిబాబు, సహాయ దర్శకుడు వెంకి రావణ్, ఇంటూరి విజయ భాస్కర్, నటులు మిలటరి ప్రసాద్, ఎర్రబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్య నిపుణులు

ప్రభుత్వ వైద్యశాలలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం

ప్రజాశక్తి-తెనాలి

ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక జిల్లా వైద్యశాలలో నిర్వహించారు.ఎన్సిడి క్లినిక్ వైద్య బందం, జనరల్ మెడిసిన్ వైద్య బందం సంయుక్తంగా రోగులకు రక్తపోటు నియంత్రణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఇ శ్రీకాంత్ మాట్లాడుతూ రక్తపోటును క్రమం తప్పకుండా పరిశీలించుకోవాలని, ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని చెప్పారు. డాక్టర్ వినీల్ మాట్లాడుతూ రక్తపోటు ప్రమాదకరమైనదని దానిని నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ముఖ్యంగా మానసిక ప్రశాంతత, శారీరక వ్యాయామం అవసరమన్నారు. రక్తపోటును గుర్తించినట్లయితే క్రమం తప్పకుండా వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మంజూష, ఫిజియోథెరపిస్ట్ ఎస్ ఆర్ అపర్ణ, వైద్య బందం ఎస్కే సత్తార్, గాయత్రి, రాజేష్, సాగర్ పాల్గొన్నారు

భారీగా బెట్టింగులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

తగ్గేదేలే అంటున్నారు పార్టీల కార్యకర్తలు అభిమానులు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నారా లోకేష్ గెలుపు ఖాయమని ఆ పార్టీ అభిమానులు గట్టిగా నమ్ము తుండగా గత ఎన్నికల్లో వైఎస్ఆర్ సిపి అభ్యర్థి దాదాపు 5300 ఓట్ల మెజార్టీతో గెలిచి ఉండటంతో వైసిపి కార్యకర్త లు తమ పార్టీ అభ్యర్థి గెలుపు పై ధీమా వ్యక్తం చేస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థి మురుగుడు లావణ్య సామాజిక వర్గం మంగళగిరిలో ఎక్కువగా ఉన్నందున తప్పక విజయం సాధిస్తుందని వారు అభిప్రాయ పడుతున్నారు. ఈ క్రమంలో దుగ్గిరాల, ఈమని, చిలువూరు తదితర గ్రామాలలో గతంలో ఎన్నడు లేని విధంగా బెట్టింగులు జరుగుతున్నాయి. దాదాపు పది కోట్ల రూపాయలు పైచిలుకు బెట్టింగులు జరిగినట్లు అంచనా. గత అసెంబ్లీ ఎన్నికల్లో బెట్టింగ్ కాసి నష్టపోయిన తెలుగుదేశం పార్టీ అభిమానులు ఈసారి తమ పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమని గతంలో నష్టం రికవరీ చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది.

తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలిచినట్లయితే వైయస్సార్సిపి వారు లక్ష రూపాయలు ఇచ్చినట్లయితే వైఎస్ఆర్ సిపి అభ్యర్థి గెలిచినట్లయితే వైయస్సార్ సిపి వారు 1,50,000 ఇచ్చేటట్లు కూడా బెట్టింగ్లు జరుగుతున్నట్లు సమాచారం. మరో గ్రామంలో ఇరుపార్టీల అభిమానులు వారి వారి ద్విచక్ర వాహనాలు కూడా బెట్టింగ్లు కట్టారు. జనసేన పార్టీ అభిమానులు ఎక్కువగా ఉన్న గ్రామాలలో జనసేన వైఎస్ఆర్సిపి అభిమానుల మధ్య బెట్టింగు సాగు తున్నాయి. జనసేన పార్టీ వారు లోకేష్ గెలుపు ఖాయమని వైఎస్ఆర్సిపి వారు తమ పార్టీ అభ్యర్థి గెలుస్తుందని బెట్టింగ్లలో పాల్గొంటున్నారు. ఇంత భారీగా బెట్టింగులు కట్టడం ఈ ప్రాంతంలో ఇదే మొదటిసారి కావటం విశేషం. గెలుపు పై ఇరుపక్షాల వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు అయినప్పటికీ గెలుపు పై తీవ్ర ఉత్కంఠ నెలకొని ఉన్నది.



మసీదు నమూనాల ప్రదర్శన

ప్రజాశక్తి - తెనాలి

హజ్ యాత్రను పురస్కరించుకొని స్థానిక వహాబ్ రోడ్డులోని మదీనా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలకు పవిత్రమైన సౌదీ అరేబియాలోని కాబా మదీనా మునర్వా నమూనాలను శుక్రవారం ప్రదర్శించారు. మదీనా మస్జీద్ మదర్సా కు చెందిన 60 మంది బాలబాలికలు వివిధ పరిమాణాలలో తయారుచేసిన నమూనాలు ముస్లింలను ఆకట్టుకున్నాయి. శుక్రవారం మసీదులో నమాజు జరిగే సందర్భంగా ఈ నమూనాలను ప్రదర్శనగా ఉంచారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ యాకూబ్, షేక్ చాంద్ బాషా, ఇమామ్ ముఫ్తి ఉస్మాన్ సాహెబ్, హఫీజ్ అల్కామా పాల్గొన్నారు.



పొన్నూరు నియోజకవర్గంలో 227 మంది హోం ఓటింగ్

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు నియోజకవర్గం లో మొత్తం సర్వీసు ఓటర్లు 513 మందికి పోస్టల్ బ్యాలెట్ పంపగా, అందు లో 16 వ తేదీ వరకు 64 పోస్టల్ బ్యాలెట్‌లు కార్యాలయమునకు చేరాయని రిటర్నింగ్ అధికారి లక్ష్మీకుమారి శుక్రవారం తెలిపారు. మిగిలిన సర్వీసు ఓటర్ల నుండి జూన్ 4 వతేదీ చివరి నిమిషం వరకు స్వీకరించ బడునని ఆమె తెలియజేశారు. నియోజకవర్గంలో మొత్తం హోం ఓటింగ్‌కు 284 మందిని ఎంపిక చేయగా వారిలో 277 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని, మిగిలిన 7గురిలో ఇద్దరు చనిపోయారని తెలిపారు.మిగిలిన 5గురు అందుబాటులో లేరని చెప్పారు. కేటగిరి 2 లో అత్యవసరసేవల కింద ఫారం 12డి అర్జీ 157మంది దాఖలు చేశారని, వారిలో 85మంది ఓటు హక్కు వినయోగించుకున్నారని లక్ష్మీకుమారి తెలిపారు. కేటగిరి3లో పోలింగ్ సిబ్బంది 2521మందికి 2428 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు.

ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ : శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన సందర్భంగా పెదనందిపాడు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయంవద్ద శుక్రవారం స్వామివారికి అర్చకులు పవన్ కుమార్, ఫణిదపు వెంకటేశ్వర్లు భువనేశ్వరి దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం, మరియు గ్రామస్తుల సహకారంతో అత్యంత వైభవంగా నిర్వహించారు. కులమత భేదం లేకుండా అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గ్రామ వీధులలో విద్యుత్ దీపాలతో అలంకరించిన బ్రహ్మంగారి జెండా ఊరేగించారు. కార్యక్రమంలో ధనుంజయాచారి, వరగాని శివ, వీర బ్రహ్మాచారి, చిన్నశాస్త్రులు, పాపాచారి, శ్రీనివాస్, సుబ్బారావు, దాసరి శివ,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




జనసేన నాయకులు కొండలరావుకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

జనసేన నాయకులు కొండలరావు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

కాపు బలిజ సంక్షేమ సేన గుంటూరు జిల్లా కార్యదర్శి, మంగళగిరి నియోజకవర్గం అధ్యక్షులు జనసేన నాయకులు తిరుమలశెట్టి కొండలరావు జన్మదినోత్సవ వేడుకలు గురువారం రాత్రి జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో కాపు సంఘం నాయకులు, జనసేన నాయకులు పాల్గొని కొండలరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మునగపాటి వెంకట మారుతీరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో 50 శాతం సబ్సిడీకి విత్తనాలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

రసాయనిక ఎరువుల వాడకం వలన భూమి సహజత్వం కోల్పోతుందని, అందువలన పచ్చి రొట్టె ఎరువులు వాడాలని మండల వ్యవసాయ అధికారి పి శిరీష రైతులకు తెలిపారు. శుక్రవారం ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. పచ్చిరొట్ట ఎరువులు లేత పూత సమయంలో కలియ దున్నటం వలన భూమి సారవంతమై అధిక దిగుబడి వస్తుందని రెండో పంటకు కూడా భూసారం అందిస్తుందన్నారు. పచ్చిరొట్ట వాడకం వలన భూమిలో నీటిని నిలుపుకునే శక్తి పెరుగుతుందన్నారు. ఆర్‌బికెలో 50 శాతం సబ్సిడీపై జీలుగా, జనుము, పిల్లి పెసర విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జీలుగా కేజీ రూ.44 జనుము రూ.44, పిల్లి పెసర రూ. 67కు రైతులకు విక్రయిస్తున్నారని, ఈ అవకాశాన్ని వినియోగించు కొవాలన్నారు. రైతులు పచ్చిరొట్ట ఎరువులు వాడుకొని భూసారం పెంచుకోవాల్సిందిగా రైతులకు తెలిపారు.

నేడు పొన్నూరులో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు పట్టణం, మండలంలో శనివారం ఉదయం 9గం నుండి, మధ్యాహ్నం 2 గం వరకు 11 కేవీ లైను మరమ్మతుల దృష్ట్యా ఐదు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పొన్నూరు ఎలక్ట్రిసిటీ ఏడీఈ ఎం శ్రీనివాసరావు, టౌన్ ఏ ఈ కె వెంకయ్య, రూరల్ ఏఈ ఎం వెంకటనారాయణ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కౌంటింగ్ కేంద్రాల్లో ఈవీఎంల భద్రతపై ఈసీ సమీక్ష


రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ వీడియోకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఐజి త్రిపాఠి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జూన్ 4 న జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా కౌంటర్ కేంద్రంలో ఏర్పాట్లు మౌలిక వసతుల కల్పన అప్పటి వరకు ఈవిఎంల భద్రత తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా ఏపి రాష్ట్ర సచివాలయం కాన్ఫరెన్స్ హాల్ నుండి శుక్రవారం సాధారణ ఎన్నికలు - 2024లో భాగంగా కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల సురక్షిత నిల్వ, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, ఐ.జి.లు, డి.ఐ.జి.లు, సీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పల్నాడు జిల్లా నుండి స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్, ఐజి సర్వ శ్రేష్ఠి త్రిపాఠి పాల్గొన్నారు. నరసరావుపేట మండలంలోని కాకాని గ్రామ పరిధిలో గల జె.ఎన్.టి.యు కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూము వద్ద నిరంతరం నిఘా విభాగం ఏర్పాటు చేశామని పటిష్ట భద్రత చర్యలు చేపట్టామన్నారు. కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయని కౌంటింగ్ కొరకు వచ్చే అధికారులకు ఇతర మౌళిక సదుపాయాల కల్పనపై దష్టి సారిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా పోలీసు ఇతర శాఖలను సమన్వయం చేసుకొని ముందుకు వెళతామని వెల్లడించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ లెక్కింపు జరిగేలా రిటర్నింగ్ అధికారులను అప్రమత్తం చేస్తామన్నారు. ఎన్నికల కౌంటింగ్ అధికారులు, సిబ్బంది తమకు నిర్దేశించిన విధులపై పూర్తి అవగాహన పెంపొందిచుకోవాలన్నారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్ లను నిబంధనలను అనుసరించి భద్రపరిచేలా చర్యలు చేపడతామన్నారు.

ఐటిఐలలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఐటిఐలలో మొదటి విడత ప్రవేశం కోసం దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు గుంటూరు ప్రభుత్వ ఐటిఐ, జిల్లా స్థాయి శిక్షణ అధికారి బిఎస్ఎస్‌వి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024 విద్యా సంవత్సరం ప్రవేశానికి ఔఱ.ఖజూ.స్త్రశీఙ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను జూన్ 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ చేసుకోవటానికి పదో తరగతి మార్కుల లిస్ట్, క్యాస్ట్ సర్టిఫికెట్, టిసి, ఆధార్ (విద్యార్థి, తల్లి, తండ్రిది) జిరాక్స్, విద్యార్థి ఫోటో, మెయిల్ ఐడి, విద్యార్థి, తల్లిదండ్రుల ఫోన్ నంబర్, రెసిడెన్షియల్ అడ్రస్‌తో నెట్ సెంటర్‌కుగానీ, దగ్గరలోని ప్రభుత్వ ఐటిఐకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.


నర్సరీని ప్రారంభిస్తున్న వీనారెడ్డి తదితరులు

విజ్ఞాన్ యూనివర్సిటీలో హైటెక్ నర్సరీ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రి, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలోని అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చరల్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'హైటెక్ నర్సరీని' అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చరల్ సైన్సెస్ ఫామ్‌లో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియా/ యుఎస్ఏఐడీ మిషన్ డైరెక్టర్ వీణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ మార్పులను తగ్గించడానికి, వ్యవసాయ అటవీ పెంపకాన్ని పెంచడానికి సహకరించాలని విద్యార్థులను కోరారు. ఏటా ఒక మిలియన్ ఆరోగ్యకరమైన మొక్కలను ఉత్పత్తి చేయగల సామర్థ్యంతో, దేశీయ చెట్ల జాతులను పెద్ద ఎత్తున ప్రచారం చేయడానికి హైటెక్ నర్సరీ రాష్ట్రంలో కేంద్రంగా మారనుందన్నారు. నర్సరీలో ఆటోమేటెడ్ ఇరిగేషన్, ఫెర్టిగేషన్, క్లైమేట్ కంట్రోల్ సిస్టమ్స్‌తో సహా అధునాతన సాంకేతికతలు ఉన్నాయన్నారు. ఈసాధనాలతో, నర్సరీ రైతులకు, ఇతర చెట్ల పెంపకందారులకు నాణ్యతగల మొక్కలను సరఫరా చేయడంలో, వాతావరణ పునరుద్ధరణను నిర్మించడంలో, వారి అగ్రోఫారెస్ట్రీ ప్రయత్నాలలో స్థానిక సంఘాలను శక్తివంతం చేయడంలో కీలక పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉందని తెలియజేశారు. ముఖ్యంగా వాతావరణ-స్మార్ట్ వ్యవసాయ పద్ధతులలో పెట్టుబడి పెట్టడం ద్వారా వాతావరణ మార్పులను తగ్గించవచ్చని అన్నారు.తెలుగు రాష్ట్రాల్లో యుఎస్ఏఐడీ మిషన్ ప్రోగ్రామ్ ద్వారా అవగాహన ఒప్పందం కుదుర్చుకుని హైటెక్ నర్సరీని మొట్టమొదటగా ప్రారంభిస్తున్న ఘనత విజ్ఞాన్స్ యూనివర్సిటీదేనని పేర్కొన్నారు. యుఎస్ఏఐడీ మిషన్ ద్వారా హై-క్వాలిటీ ప్లాంటింగ్ మెటీరి యల్స్‌ను తయారు చేయడానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న విజ్ఞాన్ యూనివర్సిటీకి ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. టీవోఎఫ్ఐ, సీఐఎఫ్ఓఆర్- ఐసీఆర్ఏఎఫ్ చీఫ్ ఆఫ్ పార్టీ మనోజ్ దబాస్ మాట్లాడుతూ అవుట్‌సైడ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో కూడా మొక్కలను విరివిగా పెంచితే ప్రజల జీవనోపాధి, పర్యావరణ వ్యవస్థ సేవలను మెరుగుపరుస్తుందన్నారు. అవుట్‌సైడ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో కూడా మొక్కలను విరివిగా పెంచి పర్యావరణ సమతుల్యానికి కషి చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు 144 సెక్షన్ అమలు

మూతపడిన దుకాణాలు - నిర్మానుష్యంగా వీధులు

మాచర్లకు చేరుకున్న కేంద్ర బలగాలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు మాచర్ల నియోజకవర్గంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. దీంతో శుక్రవారం కూడ మాచర్ల పట్టణంలో 144వ సెక్షన్ కోనసాగింది. బహుశ కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయిన తరువాత కూడ 144 సెక్షన్ అమలులో ఉండే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం కూడ దుకాణాలన్ని మూతపడ్డాయి. చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురి ఆవుతున్నారు. మాచర్ల నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా జరిగిన హింస, అల్లర్లతో పట్టణంలో బుధవారం నుండి 144 సెక్షన్ కోనసాగుతుంది. పోలీసులు పటిష్ఠ బందోబస్తు నేపథ్యంలో అల్లర్లు పూర్తిగా సద్దుమణిగాయి. అయితే సమస్యాత్మక ప్రాంతం కావటంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో అంచనా వేయటం కష్టంగా ఉందని పలువురు వాపోతున్నారు. అందుకే పోలీసు పహరాను కోనసాగిస్తున్నారు. శుక్రవారం నాడు కేంద్ర బలగాలు మాచర్లకు చేరుకున్నాయి.


రెంటచింతలలో మూతపడిన దుకాణాలు

నాలుగవ రోజు మూతపడిన దుకాణాలు

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలో నాలుగో రోజు అయిన శుక్రవారం కూడా వివిధ వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు స్తంభించిపోయాయి దీంతో చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు రోజువారి వడ్డీతో పండ్ల వ్యాపారం నిర్వహించే వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంది ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణ నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడే నిమిత్తం 144 సెక్షన్ పాటు దుకాణాలు మూసివేస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ రమణమూర్తి పేర్కొన్నారు.

ఏడు గ్రామాల్లో పోలీస్ పిక్కెట్లు

మండలంలోని 11 గ్రామాలకు గాను ఏడు గ్రామాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్లు అడిషనల్‌ఎస్పీ రమణమూర్తి తెలిపారు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఎన్నికలు ముగిసిన సందర్భంగా ఫలితాలు రాకపోవడంతో గెలుపు ఓటములపై ఏ విధమైన గొడవలకు ఆస్కారం లేకుండా వ్యవహరించాలన్నారు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తామన్నారు ఒక్కో పీకట్లు ఐదుగురు కానిస్టేబుల్ ఉంటారన్నారు రెంటాల, మంచి కళ్ళు, పాల్వాయి గేట్, తుమ్మరకోట జెట్టిపాలెం , గోలి, రెంటచింతలలో పీకెట్లు ఏర్పాటు చేశామన్నారు.


నిర్మానుష్యంగా రోడ్లు


మాచర్లలో పోలీస్ పికెట్, మూతబడిన దుకాణాలు




రెంటచింతల మండలంలో పోలీస్ పహారా

20వ తేదీన మాస్టర్‌మైండ్స్‌లో జాబ్‌మేళా

ప్రజాశక్తి-గుంటూరు

మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సంస్థ యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రిన్సిపాల్స్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్, క్యాంపస్ ఇన్‌చార్జిలు, క్లాస్ ఇన్‌ఛార్జిలు, హాస్టల్ స్టాఫ్, అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డిటిపి ఆపరేటర్లు, కంప్యూటర్ హార్డ్‌వేర్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ సూపరవైజర్లు, డ్రైవర్లు ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి నుండి ఇంటర్, డిగ్రీ, బి.టెక్ చదివి 21 నుండి 45 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పురుషులు, మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.10వేల నుండి రూ.35వేల వరకూ జీతం ఉంటుందని, దూర ప్రాంతాల వారికి వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని, ఆసక్తి ఉన్న వారు సోమవారం గుంటూరు బ్రాడీపేట, 3/11లోని మాస్టర్‌మైండ్స్ మెయిన్ క్యాంపస్‌కు రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 8978480430, 9100024059 నంబర్లలో సంప్రదించాలన్నారు.

19న పిఎస్ సంస్మరణ సభలు వాడవాడలా జరపాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపు

ప్రజాశక్తి - తాడేపల్లి

దేశవ్యాప్తంగా జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలలో మతోన్మాద బిజెపిని, వారికి మద్దతు తెలుపుతున్న పార్టీలను చిత్తుగా ఓడించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం ఉండవల్లిలో వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ సమావేశంలో రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్య జీవిత అవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగాయని, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశానంటేయని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నదని, ఈ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. నరేంద్ర మోడీ ఓడిపోతాడనే నిస్పృహలో మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టి లబ్ధి పొందేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. నరేంద్ర మోడీని ఓడించి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ముందుకు వచ్చిందని అన్నారు.మే 19న పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలు వాడవాడలా జరపాలని పిలుపిచ్చారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ రాజధాని రైతులకు పెండింగ్ ఉన్న రెండు సంవత్సరముల వార్షిక కవులనువెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాజధాని గ్రామాల్లోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంకర్లు నోటీసులు ఇచ్చి, ఇళ్లకు తాళాలు వేస్తామని బెదిరించటం మానుకోవాలని కోరారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు సి ఆర్ డి ఏ అధికారులు చెల్లించాల్సిన వాటా డబ్బులు వెంటనే చెల్లించాలని, ఆలస్యం చేస్తే సీఆర్డీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని రవి హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఈమని రామారావు, ఎం.భాగ్యరాజు సిహెచ్ సుందర్రావు గడ్డం కృష్ణ కుంభ ఆంజనేయులు నందాజీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు